క్లుప్తంగా

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మాడుగులపల్లి : ప్రభుత్వం రైతులకు రాయితీతో అందించే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి సైదానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా రూ.2,790 ఉండగా సబ్సిడీ మినహా రూ.1,116, జనుము 40 కిలోల బస్తా రూ. 3,620 ఉండగా సబ్సిడీ మినహా రూ.1,448, పిల్లిపెసర 20 కిలోల సంచి రూ. 2,710 కాగా సబ్సిడీ మినహా రూ. 1,084 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతో మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

హరీశ్‌రావుకు ఘన స్వాగతం

కొండమల్లేపల్లి : మాజీ మంత్రి హరీష్‌రావు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను పరామర్శించేందుకు దేవరకొండ వెళ్లే క్రమంలో కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేసీఆర్‌తండాలో ఆయనకు బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ/ హామీ కూలీలను కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో విఫమైందని ఆరోపించారు. కాసేపు వారితో ముచ్చటించిన అనంతరం దేవరకొండకు బయల్దేరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాయకులు కేసాని లింగారెడ్డి, రావుల వెంకటయ్య, దస్రూనాయక్, తులసిరాంనాయక్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

అడవిదేవులపల్లి : మండల కేంద్రానికి చెందిన బండి సత్యనారాయణ, అలుగుల దుర్గయ్యకు చెందిన పాడిగేదేలతో పాటు మరో రెండు గేదెలు విద్యుదాఘాతంతో చనిపోయాయి. సోమవారం పొలాల వద్దకు వెళ్లే రైతులు గుర్తించి సంబంధిత బాధితులకు తెలియజేశారు. ఇటీవల గాలివానకు తెగిపడిన ఎల్‌టీలైన్‌కు గేదెలు తగలడంతో కరెంట్ షాక్‌కు గురై మృతిచెందినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఒక్కొక్క పాడి గేదే రూ.60వేల నుంచి 70వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ మేరకు వైద్యులు, పోలీసులు పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.

వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం కొత్తగూడెంలోని మహర్షి దయానంద సేవా శ్రమ ట్రస్ట్, వృద్ధాశ్రమం, అనాథ ఆశ్రమంలో సోమవారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లాకా రాజశేఖర్, పట్టణ అధ్యక్షులు ఇండ్ల గణేష్, అభిమానులు బంటు రాజు, సలీమ్, ధర్మతేజ, శ్రీను, శివశంకర్, రవి, నిలేష్, శోభన్, శివ, నవీన్, సతీష్, మాధవ్, ముజీబ్, రాము, గని తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

మిర్యాలగూడ: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన దామరచర్ల మండలంలోని గణేష్‌పహాడ్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. గణేష్‌పహాడ్ గ్రామంలో ఆదివారం రాత్రి గాలితో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో బాలు ఇంట్లో షార్ట్ సర్క్యూటై కూలర్, టీవీ, ఫ్రిజ్, బియ్యం, దుస్తులు, వంట సామగ్రి దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకోని సోమవారం దేవరకొండ, కొండమల్లేపల్లి ప్రాంతాల్లో నల్లగొండ లీగల్ మెట్రోలజీ అధికారి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా పెట్రోల్ బంకులతో పాటు ఐరన్ హార్డ్‌వేర్, సిమెంట్ వ్యాపార దుకాణాల్లో ప్యాకేజింగ్ రూల్స్ ఉల్లంఘించినందుకు 12 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నల్లగొండ జోన్ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సిద్ధార్థ కుమార్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలేవీ?

- ఎండలోనే సేదదీరుతున్న ఉపాధి హామీ కూలీలు
- ఊరుకి ఒక్క టెంట్ మాత్రమే పంపిణీ
- ఏ గ్రూప్‌కు టెంట్ వేయాలో తెలియక ఇబ్బందులు
- ప్రథమ చికిత్స కిట్లు కూడా కరువు



ఎండలోనే పనిచేస్తున్న కూలీలు

పెద్దవూర : వలసలను నివారించి కూలీలకు ఉపాధి కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చింది. వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా రోజువారి వేతనాన్ని ఇస్తుండటంతో ఎండను లెక్కచేయకుండా కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. కానీ అక్కడ సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. నిబంధనల ప్రకారం.. వేసవి కాలంలో టెంట్, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స కిట్లు ఇలాంటి సౌకర్యాలు కల్పించాలి. ఉదహారణకు కూలికి వచ్చిన మహిళలకు చిన్న పిల్లలు ఉన్నట్లయితే కూలీలలో ఒకరిని ఆయాగా నియమించి ఆమెకు మస్టర్ వేయాలి కాని ఇటువంటివేమి జరగడం లేదు.

కానరాని నీడ..

మండలంలో మొత్తం 12976 కుటుంబాలు ఉండగా ఇందులో 27626 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2024–25లో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 5999 కుటుంబాలకు 121306 పనిదినాలను కల్పించారు. మండలంలో నీమానాయక్‌తండాలో అత్యధికంగా 19833 పనిదినాలను కల్పించగా, అత్యల్పంగా శిర్సనగండ్లలో 303 పనిదినాలను మాత్రమే కల్పించారు. పని చేసే ప్రదేశంలో కూలీలు కొద్దిసేపు సేద తీరేందుకుగాను ఎలాంటి నీడ లేదు. అధికారులు నీడ కోసం టెంట్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా గత నెలలో గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున టెంట్‌లు పంపిణీ చేశారు. కాని ఒక్కో గ్రామంలో చాలా గ్రూపులు ఉన్నాయి. ఈ గ్రూపులన్నీ ఒకే దగ్గర పనిచేయవు. చాలా ప్రదేశాల్లో పనులు చేస్తున్నారు. దీంతో జీపీకి వచ్చిన ఒక్క టెంట్‌తో గొడవలకు దారి తీస్తుందన్న కారణంతో ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. దీంతో మండుటెండలోనూ కూలీలు పనిచేస్తున్నారు. కొద్దిసేపు సేదదీరుదామన్నా పని ప్రదేశంలో ఎక్కడా నీడ లేదు. దీంతో గట్టు వెంట ఉన్న చిన్న చిన్న చెట్ల నీడలోనూ, ఎండలోనే కూర్చుని కొంతసేపు సేదదీరుతున్నారు. మండుతున్న ఎండలకు కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనికి తోడు దాహార్తిని తీర్చుకోవటానికి ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటిళ్లలో తెచ్చుకుంటున్న నీళ్లు సైతం వేడెక్కి తాగలేక పోతున్నారు. ఈ నీళ్లు తాగితే వడదెబ్బకు గురవుతున్నారు.

అందుబాటులో లేని ప్రథమ చికిత్స కిట్లు..

పని చేసే సమయంలో కూలీలకు ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే మొట్టమొదటి ప్రథమ చికిత్స అందించాల్సి ఉంది. కాని పని ప్రదేశంలో ఒక్కటంటే ఒక్క ప్రథమ చికిత్స కిట్‌లు కూడా అందుబాటులో లేవు. విష జంతువులు కాటేస్తే ఇక అంతే. గడ్డపారలు, పలుగులు కూడా గుచ్చుకుంటున్నాయి. ఇలాంటి సమయంలో ప్రథమ చికిత్స కిట్లు అవసరం ఎంతైనా ఉంది. ప్రథమ చికిత్స కిట్‌లో టించర్, బ్యాండేజ్, ఆయింట్‌మెంట్, కత్తెర, స్టిక్కర్లతో కూడిన వస్తువులు ఉండాలి. నాలుగు సంవత్సరాల క్రితం ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేయడంతో పని చేసే ప్రదేశంలో ఎక్కడా కిట్లు లేవు. దీంతో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకున్నా గ్రామానికి వెళ్తేనే చికిత్స అందే పరిస్థితి ఉంది.

తాగునీటి వసతి కల్పించాలి



పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఇంటి నుంచి వాటర్ బాటిళ్లలో మంచినీళ్లు తీసుకెళ్తున్నాము. పనిచేసే చోట నీడ లేకపోవడంతో మండుతున్న ఎండలకు గంటలోపే నీళ్లన్ని వేడెక్కుతున్నాయి. దాహం వేస్తుండటంతో చేసేది లేక కాలుతున్న నీళ్లను తాగాల్సి వస్తుంది. దాహం తీరటం లేదు. దీంతో వడదెబ్బకు గురి అవుతున్నాము. గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో పనిచేస్తున్నాము. ఇంటికి వెళ్లిన తర్వాతనే మంచినీళ్లు తాగి దాహం తీర్చుకుంటున్నాము.

– అలుగుబెల్లి రాధ, ఉపాధి కూలీ, పెద్దవూర

ఎండలోనే కూర్చుంటున్నాం



గట్ల వెంట కందకాలు తీసే పనులు చేస్తున్నాము. పని ప్రదేశంలో ఎలాంటి నీడ సౌకర్యం లేదు. దీంతో ఎండలోనే పనిచేసి కొద్దిసేపు సేదదీరలేక పోతున్నాము. ఎండలోనే కొద్దిసేపు కూర్చుకుంటున్నాము. ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడంతో ఎంత పెద్ద ప్రమాదం జరిగినా గ్రామానికి వెళ్తేనే చికిత్స అందుతుంది. ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకున్న మంచినీళ్లు ఎండకు వేడెక్కి తాగలేక పోతున్నాము. అధికారులు ఉపాధి పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– కర్నాటి సైదిరెడ్డి, ఉపాధి కూలీ, పెద్దవూర

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హాలియా : ఉద్యోగులు, యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికలో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. పట్టభ్రధుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి హాలియాలోని లక్ష్మీ నరసింహా గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. వరంగల్– ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరహాలో ఈ ఐదు రోజులు బీఆర్ఎస్ శ్రేణులు ప్రజా క్షేత్రంలో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు రాంచందర్ నాయక్, మేరెడ్డి రాజీవ్ సాగర్, రాష్ట్ర నాయకులు కడారి అంజయ్య యాదవ్, ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, నాయకులు కేవీ రామారావు, సుందర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, రవినాయక్, పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నల్లగొండ సుధాకర్, వర్ర వెంకట్‌రెడ్డి, రమేష్ జీ, గోనె విష్ణువర్ధన్‌రావు, కామర్ల జానయ్య, షేక్ అబ్బాస్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రమణరాజు,లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు నీడనిస్తూ..



నిడమనూరు : గుంటిపల్లి-జంగాలగూడెం గ్రామాల మధ్యలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

నిడమనూరు : వేసవిలో సైతం గ్రామాల్లో రోడ్ల వెంట చెట్లు చల్లని నీడని అందిస్తున్నాయి. మండలంలోని శాఖాపురంలో 30 సంవత్సరాల క్రితం ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటగా, అవి ఇప్పుడు ఏపుగా పెరిగాయి. మండలంలోని నారమ్మగూడెం, గుంటిపల్లి గ్రామాల వద్ద దశాబ్దాల కిందట నాటిన మొక్కలు నేడు బాటసారులకు నీడనిస్తున్నాయి. హరితహారంలో పెట్టిన మొక్కలు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి.

పంపిణీకి సిద్ధంగా అంగన్‌వాడీ మెడికల్ కిట్లు



అర్బన్ ఐసీడీఎస్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న మెడికల్ కిట్లు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లను పంపిణీ చేసేందుకు ప్రత్యేక చర్యలను చేపట్టింది. ప్రతి వేసవి కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ కిట్లను సరఫరా చేస్తోంది. ఈ కిట్లల్లో ప్రధానంగా 11 రకాలైనా పారసిటమాల్ మాత్రలు, పారసిటమాల్, ఆల్‌బెండజోల్ సిరప్‌లు, సిర్‌మిత్రిన్ 5శాతం లోషన్, సిప్రోఫ్లోక్సిన్ కంటి డ్రాప్, ప్రామిసిటి స్కీన్ క్రీమ్, యాంటిసెప్టిక్ లిక్విడ్, అబ్జారెంట్ కాటన్, కాటన్ బ్యాండేజ్, ఓఆర్ఎస్ పోచెట్స్, తెలుగు బుక్‌లెట్ వంటి వస్తువలను ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని మున్సిపాలిటీలో 100 సెంటర్లు, మిర్యాలగూడ రూరల్ పరిధిలోని 46 గ్రామ పంచాయతీల పరిధిలోని 111 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ మెడికల్ కిట్లు పంపిణీ చేపట్టనున్నారు.

కార్పెంటర్ కళా నైపుణ్యం



గాజు సీసాలో టేక్ మంచంతో సోమాచారి

మిర్యాలగూడ టౌన్ : త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామానికి చెందిన పామోజు సోమాచారి వృత్తిరీత్య మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో స్థిరపడ్డాడు. తనకు చిన్నప్పటి నుంచి కళాకండాలు తయారు చేయాలనే తపన ఉండేది. అయితే సమయం దొరికినప్పుడల్లా కట్టెతో వివిధ రకాల శిల్పాలను తయారు చేశాడు. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం శిక్షణలో కళా నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరడంతో పామోజు సోమాచారి తన అద్భుతమైన కళా నైపుణ్యంతో ఒక సీసాలో రెండున్నర ఇంచుల పొడవు, అర ఇంచు వెడల్పు గల టెకు మంచాన్ని తయారు చేసి శిక్షణలో ప్రదర్శించాడు. ఈ అద్భుతాన్ని పలువురు అభినందించారు. దీంతో పట్టణానికి చెందిన పలువురి ద్వారా పామోజు సోమాచారి ప్రశంసలు అందుకుంటున్నాడు.

హద్దులు ఏర్పాటు చేయాలని వినతి



ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి గ్రామ పరిధిలోని భాస్కర్‌రావు చెరువు కబ్జాకు గురవుతుందని వెంటనే అధికారులు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడవిదేవులపల్లి మండల అధ్యక్షుడు చెన్నబోయిన సైదయ్య అన్నారు. ఈమేరకు సోమవారం పట్టణంలో ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్ జ్యోతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అడవిదేవులపల్లి గ్రామ పరిధిలో సర్వే నెం.59లో భాస్కర్‌రావు చెరువు 136.25ఎకరాల విస్తీర్ణంలో ఉందని అన్నారు. ఈ చెరువు శిఖం భూములను కొంత మంది అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారని, అడ్డుకుంటున్న తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసి భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్లకంటి ఆంజనేయులు, శంకర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతను సన్మానిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరున గర్ భార్గవ్, తిరునగరు నాగలక్ష్మిభార్గవ్, తిరునగరు గంగాధర్ సతీమణి మల్లేశ్వరమ్మలు రూ.1.54లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ భార్గవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భార్గవ్ తిరునగరు గంగాధర్, తిరునగరు రమేష్, రాజేష్‌ల జ్ఞాపకార్థంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోల సైదులు ముదిరాజ్, కోశాధికారి రామస్వామి ముదిరాజ్, కార్యనిర్వహాక అధ్యక్షులు బంటు సైదులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మెరుగు రోశయ్య, బంటు శ్రీనివాస్, బంటు లక్ష్మీనారాయణ, కొంక వెంకన్న, బంటు దుర్గయ్య, నక్క బిక్షం, లింగంపల్లి శ్రీనివాస్, మెరుగు సంజీవ్, రవి, బంటు సైదులు, మామిడాల ఎల్లమ్మ, రాము తదితరులున్నారు.

పంటల ప్రణాళికను సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి

దేవరకొండ : వానాకాలం పంటల ప్రణాళికను సిద్ధం చేయాలని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం దేవరకొండ ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఆయా మండలాల వ్యవసాయ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే వానాకాలంలో రైతులకు అవసరం అయిన విత్తనాలు, ఎరువుల లభ్యత వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంది, పెసర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆమె సంబంధిత వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులు సంబంధిత వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఆమె అన్నారు. సమావేశంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ స్కీం డీడీలు వెనక్కి ఇవ్వండి

- కలెక్టర్‌కు యాదవ సంఘం నాయకుల వినతి



కలెక్టరేట్ వద్ద రాజన్నగూడెం యాదవ సంఘం నాయకులు

నిడమనూరు : గొర్రెల పంపిణీ స్కీంలో గతంలో చెల్లించిన డీడీలను తిరిగి ఇవ్వాలని మండలంలోని రాజన్నగూడెం యాదవ సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని రాజన్నగూడెంకు చెందిన 61మంది యాదవులు ఒక్కొక్కరు 42,750 రూపాయల చొప్పున మొత్తం రూ. 2,60,7,750 డీడీ తీసి అందజేశారు. చాలా మంది యాదవులు అప్పులు చేసి చెల్లించినా గొర్రెలను ఇవ్వలేదని, డీడీలను తిరిగి ఇవ్వలేదని అందులో తెలిపారు. అసలే అప్పుల పాలైన తాము ఇంకా అప్పుల చెరలో మగ్గాల్సి వస్తుందని, తాము చెల్లించిన డీడీలను వెంటనే తిరిగి ఇవ్వాలని వారు వినతి పత్రంలో కోరారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ స్కీంను భవిష్యత్‌లో అమలు చేస్తే డీడీలను మళ్లీ ఇవ్వగలమని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యాదయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, రాముడు, నరసయ్య, వినోద్, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టభద్రులు గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో ప్రచారం చేపట్టి వారు మాట్లాడారు. ప్రభుత్వానికి, నిరుద్యోగులకు మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే తీన్మార్ మల్లన్నను శాసనమండలికి పంపించాలని కోరారు. ఈనెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో వీర్లపాలెం మాజీ సర్పంచ్ చల్లా అంజిరెడ్డి, నాయకులు రూపావత్ హరిప్రసాద్‌నాయక్, పరంగి సురేష్, కొర్ర అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహించొద్దు



మాట్లాడుతున్న దీపేందర్

నల్లగొండ టౌన్ : బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, గండిచెర్వు చంద్రశేఖర్, అనిల్ చెర్రీ పాల్గొన్నారు.

చొల్లేటి ప్రభాకర్‌కు సన్మానం



ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న అభిమానులు

నల్లగొండ టౌన్ : రిటైర్డు ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ ఐఏఎస్‌కు ఎంపికై 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానికంగా ఆయన అభిమానులు ప్రభాకర్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితం తాను యూపీఎస్‌సీ పరీక్ష రాసి సివిల్స్‌కు ఎంపికయ్యానని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతీయువకులు యూపీఎస్‌సీ సివిల్స్ లక్ష్యంగా చదవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కఠోర శ్రమ, పుస్తక పఠనం, అనుకున్న లక్ష్యం మేరకు చదివితే ఐఏఎస్‌కు ఎంపిక కావడం అసాధ్యం కాదని తెలిపారు. యువత సివిల్స్ పై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానయ్య, రమణారెడ్డి, శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూముల కౌలుకు రెక్కలు

- ఎకరానికి రూ. 12వేల నుంచి రూ. 15వేల వరకు
- పత్తి ధర, దిగుబడి పెరగడమే కారణం
- భూ యజమానుల నుంచి ముందస్తు ఒప్పందం




దుక్కులు సిద్ధం చేసిన రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఎకరం... అరెకరం భూమి ఉన్న రైతులు కొందరు... ఏటా కౌలుకు తీసుకోని సాగుచేసే వారు మరికొందరు వారికి తెలిసిందల్లా వ్యవసాయయే. ప్రకృతి కనికరించి గిట్టుబాటు ధర లభిస్తే కష్టాల నుంచి గట్టెక్కవచ్చనే ఆశతో ఏటా భూములను కౌలుకు తీసుకోని సాగు చేస్తారు. వానాకాలం సాగుకు సమయం దగ్గర పడుతుండటం.. ప్రస్తుతం వర్షాలు కూడా కురుస్తుండటంతో గ్రామాల్లో పొలం పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. పత్తిని సాగు చేసేందుకు భూమి కౌలు గురించి యజమానుల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా యజమానులు గతంలో కంటే రెట్టింపు ధరలు చెబుతున్నారు. గతంలో ఎకరాకు రూ. 8వేల నుంచి రూ.10వేల వరకు ఉన్న కౌలు ధర ప్రస్తుతం రూ.12వేల నుంచి 15వేల వరకు పులుకుతోంది. నీటి సౌకర్యం ఉన్న భూములు రూ. 15వేయిల పై మాటే. జూన్ నెల నుంచి వానాకాలం సీజన్ ప్రారంభం కానుండటంతో ముందస్తుగానే ఒప్పందాలు చేసుకొని నగదును చెల్లిస్తున్నారు. ఇప్పటికే ఒప్పందం చేసుకున్న వారు ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పత్తి మొక్కలను ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తున్నారు.

పత్తిసాగే అధికం..

మండలంలో ఎర్రరేగడి, నల్లరేగడి భూములు అధికం. నాన్ ఆయకట్టు కావడంతో ఇక్కడ అధిక మొత్తంలో పత్తి పంట, ఆ తరువాత నీటి వసతి ఉన్న రైతులు మిర్చి పంటలను సాగు చేస్తారు. అన్ని రకాల పంటలకు అనువైన నేలలు ఉన్నప్పటికీ నీటి వసతి లేకపోవడంతో వర్షాధార పంట అయిన పత్తికి రైతులు మొగ్గు చూపుతారు. దీనికి తోడు పత్తి లో అంతర పంటగా కంది పంటను కూడా సాగవుతుంది. కొంత వరకు వర్షాభావ పరిస్థితులు తలెత్తినా తట్టుకొనే అవకాశం ఉంది. దీంతో ఈ పంటల సాగుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఎకరాకు రూ.15వేలు



నాకు ఉన్న రెండు ఎకరాల సొంత భూమితో పాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకోని సాగు చేస్తున్న. పోయిన ఏడాది ఎకరానికి రూ. 9వేలు చెల్లించి పత్తి పంటను సాగు చేసిన. వర్షాలు అనూకూలంగ పడటం, ధర కూడా అధికంగా ఉండటంతో కొంత వరకు అప్పులు తీరాయి. ఈ ఏడాది ఎకరానికి రూ. 12వేలు ముందుగానే చెల్లించాలని అనడంతో తప్పని పరిస్థితుల్లో సాగుకు ముందుగానే రూ. 60వేలు చెల్లించా.

– కొర్ర నాగేష, రైతు, చక్కోలంతండా

డిండి చింతపల్లిలో కంటి పొర శస్త్ర చికిత్స శిబిరం

డిండి : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం డిండి చింతపల్లిలో ఇందుర్తి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మొబైల్ కంటి పొర శస్త్ర చికిత్స శిబిరాన్ని డిండి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిబిరం నిర్వాహకులు వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుర్తి హన్మంతురెడ్డి, కాయితి మాలతిల జ్ఞాపకార్థం ఈ కంటిశస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరం 20వ తేదీ నుంచి ఈనెల 27 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అత్యాధునిక మొబైల్ వాహనంలో కంటి పొర ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్ అవసరమైన వారు ఆధార్‌కార్డుతో ఈ శిబిరం వద్ద ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440285996, 9912769422 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాల్నేపల్లి వాసికి డాక్టరేట్



మునీశ్వర్

అడవిదేవులపల్లి : మండలంలోని బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ మునీశ్వర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షాల విభాగం సోమవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'ఏ స్టడి ఆన్ పెర్ఫార్మన్స్ ఎవాల్యూయేషన్ ఆఫ్ ఏ–నామ్ విత్ రెఫరెన్స్ టూ సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ, వాణిజ్య విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, మాజీ వైస్ ఛాన్సలర్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ(సీయూకే), లేట్ ప్రొఫెసర్ హెచ్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కృష్ణ చైతన్య సూపర్‌వైజర్ పర్యవేక్షణలో ఈ పరిశోధన చేపట్టారు. మునీశ్వర్ ప్రాథమిక విద్యను బాల్నేపల్లి ప్రభుత్వ పాఠశాలలో, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఉన్నత విద్యలో డబుల్ పీజీ ఎంబీఏ, ఎం కాం, పూర్తి చేసి రెండింటీలో యుజీసీ,. ఎన్ఈటీ, టీఎస్ సెట్ సాధించడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటి నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం చేశారు. ఈ సందర్భంగా మునీశ్వర్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.